పరిహారం పెంచరూ..





బస్సు, లారీ ఢీ..

పలువురికి గాయాలు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ శనివారం తెలిపారు. తెలుగు-3, హిందీ -1, ఇంగ్లిష్-2, పొలిటికల్ సైన్స్-1, హిస్టరీ-1, బీబీఏ-1, కంప్యూటర్ సైన్స్-3, ఫారెస్ట్రీ - 2, ఫిషరీస్-1, జువాలజీ-1, మ్యాథమెటిక్స్ -1, స్టాటిస్టిక్స్ -1, ఫిజిక్స్ -1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులు అర్హులని, పీహెచ్‌డీ/నెట్/సెట్/బోధనానుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 23న 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 24న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.



## ఇద్దరు తహశీల్దార్ల బదిలీ

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ, బీర్కూర్ తహశీల్దార్లు వరప్రసాద్, లత బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ బీర్కూర్‌కు బదిలీ అయ్యారు. బీర్కూర్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న లత బాన్సువాడకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగానే వీరి స్థానచలనం జరిగినట్లు సమాచారం.

## వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఈ మేరకు పెద్ద కొడప్‌గల్ మండలం జగన్నాథపల్లిలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచితేనే భవిష్యత్తులో మానవుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటడాన్ని లక్ష్యంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేసి మొక్కలు నాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి మార్గదర్శకాలు ఇవ్వాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పోలీసు సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో శనివారం కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఈసమన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి కేసులో సంబంధిత వ్యక్తులకు సమయానుగుణంగా ఈ-సమన్స్ జారీ చేయాలని సూచించారు. పారదర్శకత, వేగవంతమైన సేవల కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత అన్ని కోర్టుల నుండి జారీ అయ్యే సమన్స్‌ను పోలీస్‌స్టేషన్ల వారీగా డౌన్‌లోడ్ చేసుకుని త్వరితగతిన వాటిని సంబంధీకులకు అందజేయాలన్నారు. శిక్షణలో డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్యాం కుమార్ ఉన్నారు.

> “ నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ముందస్తుగా హెచ్చరించి రోడ్లపై ఆక్రమణలను తొలగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందజేస్తున్నారు.
>
> \- అక్షరటుడే, ఇందూరు



అహ్మద్‌పుర కాలనీలో ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జిల్లా కేంద్రంలో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. చుట్టుపక్కల జిల్లాలు, గ్రామాల నుంచి వేల మంది ఆయా పనుల నిమిత్తం నగరానికి వస్తుంటారు. దీంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అసలే నగరంలోని రోడ్లన్నీ చిన్నగా ఉండడం.. అందులో కొందరు వ్యాపారస్తులు రోడ్డును ఆక్రమించడంతో సమస్య మరింత ఎక్కువైంది. ముఖ్యంగా ఖలీల్‌వాడి, దేవీ రోడ్, గాంధీ గంజ్, బస్టాండ్ రోడ్, గాంధీ చౌక్, పెద్ద బజార్, బోధన్ రోడ్, అహ్మద్ పురా కాలనీ, అంగడి బజార్, ఖిల్లా రోడ్ తదితర ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.



# ట్రాఫిక్ సమస్యకు చెక్

▸ రోడ్లపై ఆక్రమణల తొలగింపు ▸ స్పెషల్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు ▸ నోటీసులు ఇస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు గత 15 రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల రోడ్లపై దృష్టి సారించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రధాన రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే రోడ్లపై వ్యాపారస్తులు అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు, సామగ్రిని తొలగింపజేస్తున్నారు. గాంధీ చౌక్ నుంచి గాంధీ గంజ్ వరకు, అహ్మద్ పుర కాలనీ, శంభునిగుడి, అంగడి బజార్, ఆర్ఆర్ చౌరస్తా, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించారు.

### శంభుని గుడి వద్ద ఉద్రిక్తత

నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలంటే అందరి సహకారం అవసరం. అయితే శుక్రవారం శంభుని గుడి ప్రాంతంలో ఆక్రమణలను తొలగించే సమయంలో పలువురు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రెండో టౌన్ పీఎస్‌లో కేసులు నమోదు చేశారు.

### ఖలీల్‌వాడిలో..

ఇందూరులో అత్యధికంగా రద్దీ ఉండే ప్రాంతాల్లో ఖలీల్‌వాడి ఒకటి. ఇక్కడ సుమారు 300కు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉంటాయి. అయితే ఈ ప్రాంతంలో చాలావరకు రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయి. పలువురు డ్రెయినేజీలపై నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా సెట్ బ్యాక్ లేకుండా అనేక నిర్మాణాలు ఉన్నాయి. అలాగే పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. కేవలం ఖలీల్‌వాడిలోనే కాకుండా ఇందూరులోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో మూడు రోజులుగా నగర పాలక సంస్థ అధికారులు పలువురికి నోటీసులు అందజేస్తున్నారు. నిజానికి నిర్మాణ సమయంలోనే టౌన్ ప్లాన్ అధికారులు పర్యవేక్షించి అనుమతులు ఇవ్వాలని, అలాకాకుండా సమస్య జఠిలమైనప్పుడే నోటీసులు ఇవ్వడం సమంజసం కాదనే విమర్శలు వస్తున్నాయి.

### సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది శాశ్వతంగా ఉండేలా చూడాలి. ఇందుకు వ్యాపారస్తులు కూడా సహకరించాలి. అలా కాకుండా మూన్నాళ్ల ముచ్చటగా మారకూడదు.

– గంగాధర్, నగరవాసి

### నిరంతర ప్రక్రియ



ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే 39 (బీ) పోలీస్ యాక్ట్, 41(ఏ) సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. నగరవాసులు, వ్యాపారస్తులు సహకరించాలి.

– పబ్బ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ

## జడ్పీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**అక్షరటుడే, కామారెడ్డి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎన్నికల కార్యశాలలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఇద్దరు సీఎంలను ఓడించి వెంకట రమణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించిన చరిత్ర కామారెడ్డి ప్రజలదని గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ పోటీకి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, మర్రి రాంరెడ్డి, నాయకులు పైడి ఎల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, విపుల్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తాం



మాట్లాడుతున్న ఎడ్యుకేషన్ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ వర్సిటీ పరిధిలో ఉన్నత విద్యారంగ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఈ మేరకు శనివారం వర్సిటీలో వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెయూలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు మంజూరు చేయాలని కోరారు. వర్సిటీలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా పున్నయ్య మాట్లాడుతూ.. వర్సిటీల్లో ఏళ్లుగా అధ్యాపక నియామకాలు లేక, పదోన్నతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఛాన్సలర్ నామినీని నియమించాలన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ తదితరులున్నారు.



## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అక్షరటుడే, బాన్సువాడ:** అన్ని వర్గాల సంక్షేమమే సర్కారు ధ్యేయమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని రెడ్డి సంఘంలో శనివారం బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులున్నారు.



మాట్లాడుతున్న రామర్తి గోపి

## ఓర్వలేకనే కాంగ్రెస్‌పై విమర్శలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి అన్నారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతి చేస్తే ప్రజలు వారిని మూలన కూర్చోబెట్టారన్నారు.

### బీఆర్ఎస్ నాయకులవి అహంకారపూరిత వ్యాఖ్యలు

బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ తామే అధికారంలో ఉన్నట్లుగా భావిస్తూ అహంకారంతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. దీంతో ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు పేలవమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శోభన్, అవిన్, వినోద్ కుమార్, నరేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకొని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని స్పష్టం చేశారు.

### రక్షిత తాగునీటి సరఫరా..

గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రతి నివాస గృహానికి రక్షిత తాగునీరు సరఫరా జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని సూచించారు. కొత్త జీపీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, చందర్ రాథోడ్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియన్మావి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవోలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

## కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో శనివారం సీపీఐ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ భవిష్యత్తుకు బాటలు వేసేందుకు జిల్లా మహాసభలు దోహదపడతాయన్నారు. మార్క్సిజం సిద్ధాంతాల పునాదుల మీద ఏర్పడిందే సీపీఐ పార్టీ అని తెలిపారు. యంత్రాలు లేని సమాజం రావాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని ఆయన విమర్శించారు. దుర్మార్గులకు కొమ్ము కాసే ప్రభుత్వాన్ని అంతం చేయాలంటే అందరూ ఒకటవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపివేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చాడ హెచ్చరించారు. 2026లోపు మావోయిస్టులను అంతం చేస్తామనడం సరికాదన్నారు. మావోయిస్టులను చంపగలరు కానీ.. సిద్ధాంతాలను ఎన్‌కౌంటర్ చేయలేరని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ, జిల్లా కార్యదర్శి సుధాకర్, ఓమయ్య, రాజేశ్వర్, రాజన్న, విఠల్ గౌడ్, సాయిలు, స్వరూప, రాణి, రఘురాం నాయక్, అంజలి, దేవేందర్, అనిల్, కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత ఉత్పత్తులే వాడాలి



**అక్షరటుడే, బోధన్:** పర్యావరణహిత ఉత్పత్తులనే వాడాలని సాలూర జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజీ మంజూష అన్నారు. పాఠశాలలో శనివారం ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సుస్థిరాభివృద్ధి, ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే దుష్ప్రయోజనాలు, ఇతర అంశాలపై వివరించారు. వాటి స్థానంలో మోదుగ ఆకులతో తయారైన, పర్యావరణహిత ఉత్పత్తులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర సంతోష్ కుమార్ యాదవ్, కాంబ్లే విఠల్, గంధపు సాయిలు, అరుణ్ కుమార్, సంగీత్ రావు, రాజ్ కుమార్, అబ్బయ్య, సుధారాణి, మహేష్ రావు పాల్గొన్నారు.

## పురాతన నాణేలు, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలోని రిపుల్స్ స్కూల్‌లో శనివారం నాణేలు, నోట్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 300 ఏళ్ల క్రితం నాటి వరకు నాణేలను ప్రదర్శించారు. బాన్సువాడ పట్టణానికి చెందిన సేకరణకర్త రుద్రంగి గంగాధర్ దేశ, విదేశీ కరెన్సీ, నాణాలు, స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఏయే దేశాలకు చెందిన ఎప్పటి నాణేలు, స్టాంపులు తదితర విషయాలు వివరించారు.

### 189 దేశాల కరెన్సీ..

189 దేశాల కరెన్సీతో పాటు 10, 20, 50, 60, 100, 150, 200, 500,1000 రూపాయల నాణేలను ప్రదర్శించారు. అదేవిధంగా పురాతన కాలం నాటి రేడియో లైసెన్స్.. అన్ని దేశాలకు సంబంధించిన స్టాంపులను.. విదేశాల్లో రిలీజ్ అయిన మన హిందూ దేవుళ్ల స్టాంప్‌లను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాల్గుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రూరల్ సీఐకి సన్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిరుపతయ్యను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. సీఐని కలిసిన వారిలో జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, నస్రుల్లాబాద్ మండల సీనియర్ నాయకులు అనుసూరి శ్రీనివాస్, గొడిసెల యాదగిరి గౌడ్, పెర్క రాములు, అరిగె నారాయణ, అనిల్ గుప్తా, మనూర్ సాయిలు, కంది పెద్ద మల్లేష్, కొప్పుల సాయిలు, ఉల్లెంగ పర్వయ్య, ఉల్లెంగ కిష్టయ్య ఉన్నారు.

## మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు




**అక్షరటుడే, బోధన్:** వన మహోత్సవంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి సభ్యులు శనివారం మొక్కలు నాటారు. క్లబ్ఆధ్వర్యంలో పట్టణంలోని విజయసాయి పాఠశాల ఆవరణలో తహశీల్దార్ విఠల్, సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాసరాజు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆర్మూర్ పట్టణ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పూర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ బైపీసీ చదువుతున్న గడ్డం సంతోష్ (17) కళాశాల పక్కనే ఉన్న నర్సరీలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు వెంటనే వేల్పూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంతోష్ తండ్రి దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించి భూసేకరణపై కదలిక రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, భూసేకరణలో భాగంగా తమ నుంచి తీసుకుంటున్న భూములకు నష్టపరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు. లిఫ్ట్ పనులు కూడా విడతలవారీగా కాకుండా ఒకేసారి ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– అక్షరటుడే, నిజాంసాగర్



మాట్లాడుతున్న రైతు, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

# పరిహారం పెంచరూ..

### నాగమడుగు లిఫ్ట్ బాధిత రైతుల డిమాండ్

నిజాంసాగర్ మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో జక్కాపూర్ - వడ్డేపల్లి శివారులో నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఇందులో భాగంగా రైతుల నుంచి భూములు సేకరించారు. ఎకరాకు రూ.17 లక్షల చొప్పున పరిహారం అందించారు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించి పైప్‌లైన్ నిర్మాణం కోసం భూసేకరణ జరుగుతోంది. అయితే గతంలో భూసేకరణ సమయంలో ఎకరాకు రూ.17 లక్షలు చెల్లించిన విధంగా ప్రస్తుతమూ అంతే పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

### ప్రాజెక్టుతో ఉపయోగమే..

ఎత్తిపోతలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని రైతు సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తే మాగి, గోర్గల్, వడ్డేపల్లి, మల్లూరు, జక్కాపూర్ గ్రామాల్లోని 2,593 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. నాగమడుగు పైప్‌లైన్ నిర్మాణ పనులను ఫేజ్-1 కింద ఒకేసారి 14వేల ఎకరాలకు సంబంధించి 9 కి.మీ వరకు భూసేకరణ చేసి ఒకేసారి పనులు ప్రారంభించాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించినట్లు ఆయన వివరించారు. ఫేజ్-1 పనులు వడ్డేపల్లి నుంచి పిట్లం వరకు ఒకేసారి చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలుగకుండా మద్దతిస్తామని, త్వరలోనే ఎంపీ, ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ మంత్రి, సీఎంను కలుస్తామని వివరించారు.

### నష్ట పరిహారం పెంచాలి

తమ ప్రాంతంలో ఎత్తిపోతల పథకం నిర్మాణం జరగడం సంతోషించదగ్గ విషయమే అయినా, భూసేకరణ సమయంలో తమకు అన్యాయం చేయవద్దని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు శుక్రవారం సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి విన్నవించారు.

### ఎకరాలకు రూ.లక్ష మాత్రమే ఇచ్చారు..

గతంలో లెండి ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో కాల్వల నిర్మాణం కోసం భూ సేకరణలో భాగంగా అప్పట్లో ఎకరాకు రూ.లక్ష మాత్రమే చెల్లించారని, ఏళ్ల క్రితం భూసేకరణ చేసి ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదని వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం అదే భూమి ఎకరాకు రూ.30 లక్షలు పలుకుతోందని.. ఈ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన వాపోయారు. అలా కాకుండా ప్రస్తుతం నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్-1 కింద ఒకేసారి పిట్లం వరకు భూసేకరణ జరిపి పనులు చేపడితే బాగుంటుందన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన జుక్కల్ నాయకులు



**అక్షరటుడే, నిజాంసాగర్:** మంత్రి సీతక్కను జిల్లాకు చెందిన పలువురు నాయకులు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై ఆమెకు వివరించారు. కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్, జుక్కల్ మండలాధ్యక్షుడు సంజు పటేల్, మాజీ సర్పంచ్‌లు వినోద్ పటేల్, విఠల్ పటేల్, బిచ్కుంద మండల మాజీ జడ్పీటీసీ కమల్, మాజీ ఎంపీటీసీ అవర్ సురేష్, రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ రామలింగం, నిజాంసాగర్ మండల మాజీ జడ్పీటీసీ ప్రదీప్ పటేల్, పుల్లెల విఠల్, బిచ్కుంద మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు పాషా, జుక్కల్ నియోజకవర్గ నాయకుడు నర్సింగ్ పాల్గొన్నారు.

## బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం సర్కిల్ పరిధిలోని బ్యాంకులు, ప్రైవేట్ లోన్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ పీఎస్‌ల ఎస్సైలు మహేష్, దీపక్, భార్గవ్ పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ నిర్మాణం కోసం స్థల పరిశీలన



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణం కోసం స్థలాన్ని శనివారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న స్థలాలను తహశీల్దార్ గంగాధర్ ఆధ్వర్యంలో ఆయన పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ఏమైనా అభ్యంతరాలుంటే వారంరోజుల్లోగా తెలపాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, హెల్త్ సూపర్‌వైజర్లు, సుజాత, సావిత్రి, సర్వేయర్ పోశెట్టి, ఎజాజ్ ఖాన్, గ్రామస్థులు విఠల్, ధనరాజ్ తదితరులున్నారు.

## అధ్యాపకులు సమయపాలన పాటించాలి



**అక్షరటుడే, ఇందూరు:** అధ్యాపకులు సమయపాలన పాటిస్తూ.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణ, అధ్యాపకుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు గతేడాది కంటే ఎక్కువ అడ్మిషన్లు చేయడం అభినందనీయమన్నారు. కళాశాలలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈవో సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టైంటేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ ఉన్నారు.

## బస్సు, లారీ ఢీ: ప్రయాణికులకు గాయాలు





**అక్షరటుడే,లింగంపేట:** కేకేవై రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కామారెడ్డి నుంచి లింగంపేట వైపు వస్తున్న లారీ ఎదురెదురుగా ఎల్లమ్మ తండా వద్ద ఢీకొన్నాయి. బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అలాగే లారీ డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి.

## పాఠశాలకు మానిటర్లు అందజేత

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలం హంగర్గా ఫారం ఎంపీయూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలకు మానిటర్లు, వైఫై అందజేశారు. గ్రామస్థుడు ఎం కోటేశ్వర రెడ్డి శనివారం పాఠశాలకు మూడు మానిటర్లు, స్కూల్‌కు వైఫై కనెక్షన్ ఇప్పించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ముజాహిద్, మాజీ సర్పంచ్ ఏజాజ్ ఖాన్, సజ్జత్, ఇజూబ్ హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్, అంజద్, హర్మాన్, అయుబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



## రేషన్‌కార్డుల పంపిణీ

**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలం కంబాపూర్ గ్రామ లబ్ధిదారులకు శనివారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు కంబాపూర్ గ్రామస్థులకు బిచ్కుందలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నింటినీ నెరవేరుస్తూ వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని మంజీర పాఠశాలలో బోనాలు




కామారెడ్డి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో..



## పాఠశాలల్లో ఉత్సాహంగా బోనాల సంబరం

ఉమ్మడిజిల్లాలోని ఆయా పాఠశాలల్లో శనివారం ఉత్సాహంగా బోనాల సంబరం నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా బోనాలు ఎత్తుకొని సంబురాల్లో పాల్గొన్నారు. బాలురు పోతరాజుల వేషధారణలో అలరించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు తెలిపే విధంగా విద్యార్థులు బోనాలు, బ్యాండ్ మేళాలతో సంబరం నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో..